క్లుప్తంగా

పోరాడే అభ్యర్థిని గెలిపించండి



నయీంనగర్: వరంగల్, నల్గొండ, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికలో నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడే తనకు ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చేసిన అనేక ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడుతోందని చెప్పారు. తనను ఓడించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది సిగ్గుచేటని విమర్శించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అవినీతి అధికారులు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నారని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పట్టభద్రుల డిమాండ్లను సాధించుకోవాలంటే తనతోనే సాధ్యమని అన్నారు.

ప్రేమేందర్ రెడ్డిని ఆదరించాలి



హన్మకొండ: పట్టభద్రుల పక్షాన నిలబడి పోరాడే గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాలు, పెద్దమ్మగడ్డలోని వరంగల్ సర్కిల్ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి సతీమణి లక్ష్మీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావు పద్మ సోమవారం ప్రచారం నిర్వహించారు. గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని విద్యుత్ ఉద్యోగులను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పులి సరోత్తంరెడ్డి, కొలను సంతోష్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, తీగల భరత్ గౌడ్, నర్మెట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: పట్టభద్రులు భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నేత కర్నె రవీందర్ కోరారు. వరంగల్ 41 డివిజన్‌లో శంభునిపేట, విశ్వనాథకాలనీ, నాగేంద్రకాలనీల్లో సోమవారం కరపత్రాలను అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ప్రశ్నించే గొంతును ఎన్నుకుంటే యువతకు ఉద్యోగ, ఉపాధి మార్గాల ఎక్కువగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, 42వ డివిజన్ అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, 39వ డివిజన్ అధ్యక్షుడు బొరిగం నాగరాజు, పట్టభద్రులు రంజిత్, కార్తీక్, అజేంద్ర, వంశీ, భవిత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి టీడీపీ మద్దతు

నయీంనగర్: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల దేవేందర్‌రెడ్డికి తెలుగు దేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకుడు గట్టు ప్రసాద్ బాబు, హనుమకొండ సాంబయ్య తెలిపారు.

కొట్లాడే గొంతుకను గెలిపించాలి



విద్యారణ్యపురి: విద్యావంతుడు, కొట్లాడే గొంతుకైన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలిపించాలని మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. హనుమకొండలోని రాంనగర్‌లో కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులతో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేధావి వర్గంనుంచి వచ్చిన సమాజ సేవకుడు, వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి, పుట్టిన గడ్డపై మమకారంతో రాజకీయ అరంగేట్రం చేసి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు కందుకూరి ప్రభాకర్, డాక్టర్ పాలాకుల కొమురయ్య, దామోదర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కార్యదర్శి సూర్యకిరణ్, రాజేష్‌నాయక్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, యూనివర్సిటీ నాయకులు గొల్లపెల్లి వీరు, ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు క్రీడా పోటీలు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ జర్నలిస్టు సభ్యులకు క్రీడలు నిర్వహించాలని ప్రెస్ క్లబ్ కమిటీ నిర్ణయించింది. క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి గల జర్నలిస్టులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రెస్ క్లబ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రానైట్ లారీల రాకపోకలపై వివాదం

- క్వారీ నిర్వాహకులు, కాలనీవాసుల మధ్య వివాదం
- కాజీపేట పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు



అంతర్గత రోడ్డులో నుంచి వెళ్తున్న లారీ (ఫైల్)

కాజీపేట: కాజీపేట పట్టణ శివారులో ఉన్న ఓ క్వారీ నిర్వాహకులు, కాలనీవాసులకు మధ్య ఏర్పడిన వివాదం ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించింది. క్వారీల నుంచి భారీ సైజ్ గ్రానైట్ నిక్షేపాలతో కూడిన లారీలు రాకపోకలు సాగించడ వల్ల అంతర్గత సీసీ రోడ్డు ధ్వంసం అవుతున్నాయని ఏఆర్ఆర్ నగర్, బృందావన్ కాలనీ వాసులు కొద్దిరోజులుగా నిరసన తెలుపుతున్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం

గతేడాది కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఐక్యంగా ఉంటూ లారీలను అడ్డుకున్నారు. దాంతో క్వారీ నిర్వాహకులు, స్థానికులు పరస్పరం పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టుకున్నారు. ఇటీవల కాలంలో లోక్‌సభ ఎన్నికలు రావడం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వ్యాపారులు, కాలనీవాసులు మిన్నకుండిపోయారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం గ్రానైట్ రాళ్లను లారీల్లో తరలించడానికి వ్యాపారులు చర్యలు చేపట్టడంతో కాలనీవాసులు తిరిగి అడ్డుకుని నిరసన తెలపడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు 100 నంబర్‌కు డయల్ చేయగా సకాలంలో పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు.

పరిష్కారం చూపాలి

క్వారీ నిర్వాహకులు, కాలనీవాసుల మధ్య ఏర్పడిన గొడవ పోలీస్ స్టేషన్‌కు చేరడంతో రెండు వర్గాల వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతితో తవ్విన గ్రానైట్ రాయిని ఎగుమతి చేయకుండా ఉంటే తమకు నష్టం తప్పదని వ్యాపారులు అంటుండగా, జనావాసాల మధ్య క్వారీ పనులు జరుగుతుండమే గాక భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు దెబ్బతింటున్నట్లు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ముదిరిన వివాదం ప్రజాప్రతినిధులు, నాయకుల చుట్టూ తిరిగేలా చేస్తుండడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. వివాదం మరింతగా జఠిలం కాకముందే సంబంధిత అధికారులు మేల్కొని ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని చూపించాలని పలువురు కోరుతున్నారు.

పలివేల్పులలో కబ్రస్థాన్ రోడ్డు కబ్జా



ధ్వంసం చేసిన రోడ్డు



రోడ్డు నిర్మాణ పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకం

హసన్‌పర్తి: నగరంలోని ఒకటవ డివిజన్ పలివేల్పులలో కబ్రస్తాన్‌కు వెళ్లడానికి నిర్మించిన రోడ్డు కబ్జాకు గురైంది. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం పెద్దలు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. పలివేల్పుల శివారులోని సర్వే నంబర్ 416లోని భూమిని ప్రభుత్వం కబ్రస్తాన్‌కు కేటాయించింది. సర్వే నంబర్ 415లో నుంచి మూడు గుంటలను భూ యజమాని ఖబ్రస్థాన్‌కు దానంగా ఇచ్చాడు. ఆ భూమి చుట్టూ కాంపౌండ్ నిర్మాణం చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి కబ్రస్తాన్ వరకు వెళ్లడానికి మూడేళ్ల క్రితం సుమారు రూ.15లక్షల నిధులతో రోడ్డు నిర్మించారు. తాజాగా, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్రస్థాన్‌కు వెళ్లడానికి నిర్మించిన రోడ్డును ధ్వంసం చేశాడు. భూమి తనదేనంటూ ముస్లింలపై దౌర్జన్యానికి దిగాడు. దీంతో ముస్లిం నాయకులు ఆందోళనకు గురై ఎమ్మెల్యే నాగరాజును సోమవారం కలిసి భూ కబ్జా విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈసెట్ ఫలితాల్లో ఐరా అకాడమీ ప్రభంజనం



చందు



శ్రీవాత్సవ్



దీక్షిత్

రామన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఈసెట్ ఫలితాల్లో ఐరా అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని డెరెక్టర్లు ఎస్ఎస్.రెడ్డి, దేవా తెలిపారు. మెకానిక్ విభాగంలో కందికొండ చందు 2వ ర్యాంకు, జావత్ సాత్విక 3వ ర్యాంకు, కొప్పుల అకిల్ 6వ ర్యాంకు, బిట్ల నిఖిల్ 10వ ర్యాంకు, ఓదేట గౌతమ్ 12వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఎలక్ట్రిక్ విభాగంలో తాటిపాముల శ్రీవాత్సవ్ 2వ ర్యాంకు, రిషత్ 15వ ర్యాంకు, కంప్యూటర్ విభాగంలో దీక్షిత్ 3వ ర్యాంకు, బండారి హేమశ్రీ 9వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. లాంగ్ టర్మ్ ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు వారిని అధ్యాపలు అభినందించారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పల్లెపాడు దామోదర్

హన్మకొండ: తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాలపై వినియోగదారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ సూచించారు. ప్రపంచ మెట్రాలజీ డేను పురస్కరించుకుని హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం, కన్జ్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ చట్టం -2009 రూల్స్ 2011 ప్రకారం వినియోగదారులు నిత్య జీవితంలో వినియోగిస్తున్న సరుకుల సమాచారం వారికి అర్థమయ్యే భాషలో ఉండేలా, తనిఖీలు నిర్వహించే బాధ్యత తూనికలు, కొలతల శాఖపై ఉందని గుర్తుచేశారు. తూనికలు కొలతల్లో మోసం జరిగినప్పుడు సంబంధిత శాఖ అధికారులను వినియోగదారులు సంప్రదించాలని సూచించారు. వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ద్వారా బాధితులు నష్టపరిహారం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు కవిరాజ్, హైమావతి, జ్యోత్స్న, ఎ.సతీష్, హరిత, మంజుల పాల్గొన్నారు.

ఆంజనేయుడి విగ్రహానికి క్షీరాభిషేకం



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయుడి విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు జాగర్లపుడి శ్రీనివాసశర్మ 108లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకొచ్చిన నదీ జలాలతో స్వామివారిని అభిషేకించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అనగం యాదగిరితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

హసన్‌పర్తి: భీమారంలో కబ్జాకు గురైన సర్కారు భూములను పరిరక్షించాలని కార్పొరేటర్ జక్కుల రజిత కోరారు. ఈమేరకు భీమారంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భీమారంలోని శ్యామల చెరువు, పుట్టలమ్మ చెరువు, కొచ్చెరువులతో పాటు ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురైనట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములకు హద్దులు నిర్ధారించాలని సూచించారు. కొంతమంది ఎస్సారెస్పీ భూములను ఆక్రమించి విక్రయాలు చేపట్టారని తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మహమ్మద్ అలీకి సన్మానం

రామన్నపేట: అంతర్ రాష్ట్రాల దొంగల ముఠాలను అతితక్కువ సమయంలో పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మీర్ మహమ్మద్ అలీని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ బారి సోమవారం సన్మానించారు. అలీతో పాటు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సై లచ్చయ్య, ఏఎస్సై చంద్రమౌళి, కానిస్టేబుళ్లు తిరుపతి, హరినాథ్, క్రైమ్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గతంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పలుచోట్ల అంతర్ రాష్ట్ర దొంగలు సుమారు రెండున్నర కిలోల బంగారాన్ని చోరీ చేయగా దాన్ని 24 గంటలలోనే ఛేదించి దొంగల గుట్టు రట్టు చేయడంలో కానిస్టేబుల్ అలీ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.



అలీని సన్మానిస్తున్న డీసీపీ బారి, తదితరులు

చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: ప్రహరీ నిర్మాణానికి తవ్విన కందకాన్ని పూడ్చి భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు సామల నిరంజన్, నూనె రవి కోరారు. ఖిలావరంగల్ శివారు దూపకుంట రోడ్డులో పట్టాదారుడి వద్ద కొనుగోలు చేసిన భూమి తనదంటూ ప్రహరీ కోసం తవ్విన పునాదిని పూడ్చి కబ్జాకు యత్నించిన వ్యక్తిపై బాధితులు సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులను గుర్తించిన వీసీ



మాట్లాడుతున్న శ్రీధర్ కుమార్‌లోథ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకులను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ గుర్తించి పలు పాలనాపరమైన పదవుల్లో వారిని భాగస్వాములను చేశారని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (కుక్టా) డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్ గుర్తుచేశారు. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో శ్రీధర్‌కుమార్ మాట్లాడారు. గత మూడేళ్లలో యూనివర్సిటీ అభివృద్ధికి వీసీ రమేష్ ఎంతో కృషిచేశారని కొనియాడారు. అలాగే యూనివర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ తీసుకురావడానికి ఎంతో శ్రమించారని అన్నారు. యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, పలు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారని తెలిపారు. కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.ప్రసాద్, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, దామెర భిక్షపతి, జేత్య, దయాకర్, సంగీత్, లక్ష్మి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

అష్టోత్తర శత కలశాభిషేకం

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో అష్టోత్తర శత కలశాభిషేకాన్ని యాజ్ఞికుడు రవి ఆచార్యుడు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 18నుంచి 23వ తేదీ వరకు షష్టి (6వ) వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: వరంగల్ చెందిన తెలంగాణ రాష్ట్ర ఆల్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను బైక్ మెకానిక్‌లతో కలిసి రాష్ట్ర ఆల్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తాబేటి బాబు, రాష్ట్ర కార్యదర్శి చెలిమల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్ సోమవారం పరామర్శించారు. రూ.80 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్యకు అందజేసి రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు బిల్లా రమేష్, ఎండీ.అంకూస్, గొట్టెముక్కల శ్రీనివాస్, జిల్లా కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న బైక్ మెకానిక్‌లు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ బ్రాహ్మణవాడలోని విద్యానికేతన్ హైస్కూల్ 1995 – 1996వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఓ ప్రైవేట్ రెస్టారెంట్‌లో నిర్వహించారు. 28ఏళ్ల అనంతరం అందరు ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అకాల మరణం చెందిన తమ స్నేహితులను గుర్తు చేసుకొని మౌనం పాటించారు. ఒకరికి ఒకరు తోడు ఉండాలని సమ్మేళనంలో తీర్మానించారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసునూటి సుమతి, స్వప్న, శ్రీకాంత్, లక్ష్మణ్, కల్పన, చంద్రవతి, వెంకటేశ్వర్లు, కిషన్, సరళ, సాయిలీల పాల్గొన్నారు.

కొత్తకుంట గండికి మోక్షం ఎప్పుడో?



కొత్తకుంటకు పడిన గండి (ఫైల్)



నేటికీ పూడ్చకుండా ఉన్న గండి

- 10 నెలలుగా గండి పూడ్చని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మడికొండ రైతులు
- ఉపాధి కోల్పోతున్న ముదిరాజ్‌లు

మడికొండ: గతేడాది జూలైలో కురిసిన వర్షాలకు కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కొత్తకుంట చెరువుకు గండి పడింది. దాంతో వరద నీరంతా వృథా అయింది. నాటి నుంచి నేటి వరకూ నీటి పారుదల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దాంతో కుంట కింది ఆయకట్టు పంటపొలాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బావులు, బోర్లు అడుగంటి పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యలను పరిష్కరించాలని అప్పటి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటి ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పందించి గండిని పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అడుగంటిన బావులు, బోర్లు



కొత్తకుంటకు గండి పడడంతో బావులు, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయింది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గండిని పూడ్చాలని మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దాంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

\- సమ్మయ్య, రైతు

గండితో ఉపాధి కోల్పోయాం



గత వర్షాకాలంలో కుంటలో సుమారు రూ.2లక్షల విలువ గల చేపపిల్లలను వేశారు. గతేడాది కురిసిన వర్షాలకు కుంటకు గండి పడడంతో తీవ్రంగా నష్టపోయాం. అధికారులు, పాలకులు స్పందించి కుంటకు పడిన గండిని పూడ్చాలి.

\- యాదగిరి, ముదిరాజ్ కులస్తుడు

పెద్దచెరువు తూముకు మరమ్మతులు

మడికొండ: మడికొండ పెద్ద చెరువు తూముకు మరమ్మతులను సోమవారం చేపట్టారు. తూము షెట్టర్ తుప్పు పట్టిపోవడంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించి నిధులు మంజూరు చేశారు. ఈమేరకు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణలను పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ పనులను దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో గండి పడిన మడికొండ కొత్తకుంట పనులను కూడా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తూముకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

వైభవంగా మైసమ్మతల్లి బోనాలు



బోనాలతో తరలివెళ్తున్న గౌడ కులస్తులు

మడికొండ: మడికొండలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మతల్లి బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు సప్పుళ్ల మధ్య మహిళలు తమ పిల్లాపాపలతో కలిసి తాటివనంలో ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయానికి సాయంత్రం తరలివెళ్లారు. అమ్మవారికి రాత్రి బోనాలు సమర్పించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి యాటపోతులతో మొక్కులు సమర్పించనున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచర్ల రాజు, డైరెక్టర్లు మునిగాల సదానందం, బుర్ర సతీష్, బైరి రాజు, మొడెం సతీష్, బొల్లికొండ సంపత్, తండ అఖిల్, మాచర్ల రాజ్‌కుమార్, సంఘం సభ్యులు తండ శంకర్, బుర్ర శ్రీధర్, మునిగాల సారంగం, బొల్లికొండ లింగయ్య, నాయకులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్యవైశ్య మిత్రుల సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న బృందం ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: పదవ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులను సోమవారం సన్మానించారు. వరంగల్ మేదరవాడలోని ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యాలయంలో కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 9.5 – 10 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు, ఇంటర్ సెకండియర్‌లో 95% మార్కులు సాధించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రబందం కోశాధికారి దొడ్డ మోహన్‌రావు, నాయకులు పల్లా పరమేశ్వర్, పాల మురళీధర్, సదాశివుడు, చిన్నాల సురేష్, మిత్తింటి సురేందర్, యాదా గణేష్, పుల్లూరి రఘుబాబు, కొడ పాండురంగం, మహిళా విభాగం నాయకురాలు చొల్లేటి కళావతి, గట్టు ధనలక్ష్మి, బాదం శిరీష, గోరంట్ల సంపూర్ణ, అల్లాడి జ్యోతి, కొడ శ్రీలత పాల్గొన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో వివిధ కళాశాలల్లో, విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన కొనసాగించారు. ముందుగా ఉదయం 11 గంటల నుంచి పరిపాలనా భవనం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి ఆందోళన కొనసాగిస్తున్నారు. పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన 6వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ పార్ట్‌టైం అధ్యాపకులుగా గత 13 ఏళ్ల నుంచి మొదలుకొని 18 ఏళ్లుగా పార్ట్‌టైంగానే పనిచేస్తున్నారన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నామన్నారు. అయినప్పటికీ అధికారులు తమ సమస్యను పరిష్కరించటం లేదన్నారు. కొందరు పార్ట్‌టైం అధ్యాపకులుగానే ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా పార్ట్‌టైం లెక్చరర్లకు లేవన్నారు. తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు కృష్ణసుమంత్, భాగ్యమ్మ, దేవోజి నాయక్, ఫణి, నరేందర్, కల్యాణి, ప్రియా, సంధ్య, సురేష్, బక్కి శ్రీనివాస్, కిరణ్, సుధీర్, లక్ష్మీనారాయణ, రవీందర్, జాస్మిన్, శ్యాంసుందర్‌చారి, మయూరి, వాణిదేవి, రజనీకాంత్, సృజన, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.